## విశాఖ లోనే రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు (ఆర్ఆర్ బి) సెంటర్ పెట్టాలి - సిపిఐ డిమాండ్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:**
విశాఖపట్నంలోనే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బి) పెట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ కె రహిమాన్ లు డిమాండ్ చేశారు. మంగళవారం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ మన దేశంలో కోల్కత్తా మెట్రో, కొంకణ్ రైల్వే లతో కలిపి 19 రైల్వే జోన్లు ఉన్నాయని, ఆర్ ఆర్ బి కేంద్రాలు 21 ఉన్నాయని అన్ని ఆర్ ఆర్ బి కేంద్రాలు జోన్ హెడ్ క్వాటర్ లోనే ఉన్నాయని, అనేక పోరాటాలు చేసి సాధించుకున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ హెడ్ క్వార్టర్ విశాఖపట్నం లోనే ఆర్ ఆర్ బి కేంద్రం పెట్టాలని సిపిఐ తరుపున డిమాండ్ చేశారు.
ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఆర్ ఆర్ బి సెంటర్ అమరావతిలో పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సరియైనది కాదని తెలిపారు.
ఎ రకమైన రసాయిన పరిశ్రమలు వచ్చినా ఉత్తరాంధ్ర లోనేనా, ఇటీవల డేటా సెంటర్లు అన్ని ఉమ్మడి విశాఖ జిల్లా లోనే పెడుతూ ఇక్కడ పర్యావరణం నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని కేంద్రంలో డేటా సెంటర్లు పెట్టుకోవచ్చు కదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ హెడ్ క్వార్టర్ విశాఖలోనే ఆర్ ఆర్ బి సెంటర్ పెట్టడం వలన ఉత్తరాంధ్ర విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.పలువురు జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గాజువాకలో రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతి



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** గాజువాక పరిధిలోని షీలానగర్–గవర జగ్గయ్యపాలెం క్యాబిన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కలకలం రేపింది.
మృతుడు ఆళ్ల సత్తిబాబు (45)గా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆయన రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.
మృతికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## విజ్ఞాన్ దువ్వాడలో హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ప్రారంభం



**కూర్మన్నపాలెం :పెన్ పవర్, ఆగస్టు 4,** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో కోడింగ్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, కాంపెటిటివ్ ప్రోగ్రామింగ్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ను ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థులుతో పాటు సీఎస్‌ఈ అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులకు కోడింగ్ ప్రాక్టీస్, హ్యాకథాన్‌లు, సాంకేతిక పోటీలు, కాంపెటిటివ్ ప్రోగ్రామింగ్‌లో పాల్గొనే అవకాశాలు కల్పించడంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ క్లబ్ వేదికగా నిలవనుంది. కార్యక్రమంలో వివిధ సాంకేతిక బృందాలను కూడా పరిచయం చేశారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి బి. దినేష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అభినందించి, హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ఏర్పాటు చేసిన అధ్యాపక సమన్వయకర్తలు, విద్యార్థులను అభినందించారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థుల్లో కోడింగ్ ప్రతిభ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందడంతో పాటు పోటీ ప్రోగ్రామింగ్ మరియు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. మహంతి మోహన్ మరియు వై. శ్రీలత సమన్వయం చేశారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు కార్మిక చట్టాలను అములు చేయాలి

* ఏఐటీయూసీ నేత పడాల రమణ డిమాండ్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 4 :** . గ్రామపంచాయతీ ఉ స్వచ్ఛభారత్ కార్మికులు క్లాప్ మిత్రలు పెండింగ్. పారిశుద్ధ్య వాటర్ సప్లై ఎలక్ట్రిషన్ లుగా విధులు నిర్వహిస్తున్నా వారికి కార్మిక చట్టాలు అమలు చేసి సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని కోరుతూ అందరి ప్రదేశ్ గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆనందపురం మండల కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం ఎంపీడీవో బి. సత్యనారాయణ గారికి సమస్యలతో కొన్ని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ అనేక గ్రామపంచాయతీలలో జీతాలు రాక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం గానీ అధికారులు గానీ కనీసం స్పందించకపోవడం పని చెప్పే అధికారులకు జీతాలు ఇవ్వాలనే కనీస స్పృహ లేకపోవడం సిగ్గుచేటు సంవత్సరాలుగా గ్రామాల్లో ప్రజలకు సేవ చేస్తూ గ్రామాల శుభ్రం చేస్తూ తమ జీవితాలను ప్రణంగా పెట్టి ప్రజల జీవితాలలో కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం నమ్మక నేరేతరులు వివరిస్తుందని మరోపక్క రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చేయని సంబరపడుతున్న పాలకలు ఈ అవార్డులు రావడానికి కారణమైన శ్రమజీవులు ఎందుకు గుర్తు రావడం లేదు ఆకలి మంటలు జబ్బులు మాకా. అవార్డులు మీకా అని ప్రశ్నించారు కార్మికులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వీధులు, కాల్వలు శుభ్రం చేయడమే కాకుండా అనేక రకాల పనులు ఉపయోగిస్తున్నారు. గ్రామాలు శుభ్రంగా ఉందాలని పంచాయితీఅధికారులు, సచివాలయ సిబ్బంది మొదలైన వారు నిరంతరం పనిలో ఉంచుతున్నారు. మాకు జీతాలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసినా, అధికారులు అమలు చేయలేదు. జీతాలు ఇవ్వలేదు. జీతాలు అడిగితే పనులు మానుకోమని బెదిరిస్తున్నారు. అని ఆవేదన వ్యక్తం చేశారు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో కాంట్రాక్టర్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య ఎలక్ట్రికల్ వాటర్ సప్లై కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలు కూడా నెలలు తరబడి ఇవ్వడం లేదు అడిగితే మాకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు చెబుతూ పంచాయతీ కార్మికుల్ని శ్రమదోపిడి చేస్తున్నారు వెంటనే తమరు కలుగజేసుకొని పెండింగ్ లో ఉన్న జీతాలు ఇప్పించవలసిందిగా కోరుతున్నాము. 2020న జీవో విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 6000/–ల నుంచి రూ.10,000/–లకు రూపాయలు జీతం పెంచుతూ 680 జీవోను విడుదల చేసినారు. ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
680 జీవను అమలుపరచి పదివేల జీతం ఇవ్వాలి.
పారిశుద్ధ్య కార్మికులుగా గుర్తించి 21. రూ00.వేలు వేతనం ఇవ్వాలి సర్పంచుల ద్వారా కాకుండా ట్రెజరర్ ద్వారానే జీతాలు ఇవ్వాలినీ స్వచ్ఛభారత్ కార్మికులకు 2018 నుంచి ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.
రాజకీయంగా ఎవరిని తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలి.
గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి
పనిముట్లు మాస్కులు, బ్లౌజులు, శానిటైజర్లు ఇవ్వాలి.
డిపిఓ ద్వారా కాని ఎంపిడివో ద్వారా కాని గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలి.
రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయితీలు, డంపింగ్ యార్డులు లేవు, కొత్త షెడ్లు నిర్మించాలి.
పెరుగుతున్న జనాభా ప్రతిపాదికన కార్మికుల సంఖ్య పెంచాలి.
ఈ కార్యక్రమంలో. చెల్లూరి కృష్ణ. సిహెచ్ శంకర్. సత్యనారాయణ స్వామి నాయుడు. కనకరాజు. అప్పలరాజు సూరిబాబు ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ ఉద్దానం ప్రజలకు, స్టీల్ ప్లాంట్ కార్మికులకు మరియు యువతకు నమ్మకద్రోహం చేశారు: కాంగ్రెస్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 4 :**జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు, జెన్ జీ యువతకు మరియు విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నమ్మకద్రోహం చేశారని కాంగ్రెస్ నాయకుడు జగన్ మురారి విమర్శించారు.
గతంలో ఉద్దానం ప్రాంతంలో పవన్ పర్యటించి కిడ్నీ బాధితులకు అండగా ఉంటానని, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అక్కడి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి వచ్చాక ఆ వైపు కూడా చూడటం లేదని అన్నారు. ఎన్నికల ముందు విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించి "నాకు అధికారం ఇస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపుతాను" అని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల బాధలు వినడానికి కూడా పవన్ సమయం ఇవ్వడం లేదని విమర్శించారు.
కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం జనవరిలో స్టీల్ ప్లాంట్‌కు ?11,440 కోట్లు విడుదల చేసినా, అందులో బ్యాంకు వడ్డీలు, వి.ఆర్.ఎస్ తీసుకున్న వారికి సెటిల్మెంట్ చేయడానికే సరిపోలేదని అన్నారు. ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం సహకరించకపోయినా పవన్ కళ్యాణ్ మౌనం పాటిస్తున్నారని, ప్లాంట్‌లో నిత్యం ప్రమాదాలు జరిగి ఎందరో కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేశామని ప్రచారం చేసుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని, అలాగే స్టీల్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు కేటాయించాలి, సొంత గనులు ఇవ్వాలనేది కార్మికుల ప్రధాన డిమాండ్ అని జగన్ మురారి తెలిపారు.
పవన్ కళ్యాణ్ తనను నమ్మిన వారికి నమ్మకద్రోహం చేయడం నేర్చుకున్నారని, అధికార మదంతో, అహంకారంతో యువతపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై లక్షలాది మంది యువత కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తే, కేంద్రం అమానుషంగా విద్యార్థులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించిందని, యువతకు తీవ్ర గాయాలయ్యాయని, దేశమంతా ఖండించిందని అన్నారు. దాని గురించి పవన్ కళ్యాణ్‌కు బాధ కలగలేదు, కన్నీరు కారలేదు, కానీ దానికి కారణమైన ప్రధాని మోదీపై జాలి చూపిస్తున్నారని విమర్శించారు. యువత సహకారంతోనే సినిమా రంగంలో పవర్ స్టార్ అయ్యారని, రాజకీయ పార్టీ పెట్టి రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యారని, అలాంటి జెన్–జీ యువతను పవన్ విమర్శిస్తున్నారని జగన్ మురారి అన్నారు.
గతంలో భోగాపురం విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు అండగా ఉంటానని చెప్పారని, ఇప్పటికీ చాలా మంది రైతులకు నష్టపరిహారం అందకపోయినా ఆయనకు పట్టడం లేదని అన్నారు.
పవన్ కళ్యాణ్ పచ్చి అవకాశవాది అని, గతంలో మోదీని తిట్టిన నోటితోనే ఈరోజు భజన చేస్తున్నారని, పవన్ కళ్యాణ్ లాంటి ఊసరవెల్లి గురించి తెలిస్తే చేగువేరా ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు, యువత పవన్ కళ్యాణ్‌కు గట్టి బుద్ధి చెబుతారని జగన్ మురారి అన్నారు.

## తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం.

* పుట్టిన అరగంటలోపు తల్లిపాలను పట్టించాలి.
* సిడిపిఓ సిహెచ్ శ్రీదేవి.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.** తల్లిపాలకు మించిన అమృతం మరొకటి లేదని పుట్టిన అరగంటలోపు తల్లి బిడ్డలకు ఇవ్వడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని అందించిన వారవుతారని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సిహెచ్ శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమసింగి అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలను పట్టించాలన్నారు. కొలస్ట్రం ఫీడింగ్ వలన తల్లులకు మరియు పిల్లలకు కలిగే లాభాలు గురించి ఆమె వివరించారు. తొలి పాలు ( కొలెస్ట్రామ్ ) శిశువుల సహజ రోగనిరోధక శక్తికి పెంపొందించి అనేక వ్యాధుల బారి నుంచి రక్షిస్తాయి అన్నారు. బిడ్డల ఎదుగుదలకు దోహదం చేయడంతో పాటు తల్లి బిడ్డల మధ్య పేగు బంధాన్ని బలపరుస్తాయన్నారు బాలింతలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమసింగి అంగన్వాడీ కేంద్రం సెక్టార్ సూపర్వైజర్ డి. విజయభారతి, పశువుల బంధ అంగన్వాడీ కేంద్రం సూపర్వైజర్ ఎస్ గౌరీ, నెల్లూరు మెట్ట అంగన్వాడి కేంద్రం జి సౌజన్య, కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రం డి తులసి ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి



**లబ్ధిదారులకు రూ.6.54 లక్షల చెక్కుల పంపిణీ**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 04 :** దక్షిణ నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీ.ఎం.ఆర్ఎఫ్ ద్వారా మంజూ రైన ఆర్థిక సహాయ చెక్కులను మంగళవారం విశాఖ జనసేన పార్టీ నగర కార్యాలయంలో పంపిణీ చేశారు. దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే, విశాఖ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.వివిధ వార్డులకు చెందిన 16 మంది లబ్ధిదారులకు ఆసుపత్రి చికిత్స ఖర్చుల నిమిత్తం మొత్తం రూ.6,54,009 విలువైన సీ.ఎం.ఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
అనంతరం 37వ వార్డు అధ్యక్షుడు గరికిన రవి ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువత జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సేవే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పంటలపై ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 5:** పంటల సాగుపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి ఆధ్వర్యంలో బుధవారం దుచ్చెర్లపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీకే వీధి మండలంలోని దుచ్చెర్లపాలెం, ఏబులం, ఈకట్టువీధి, అరటిచెట్లవీధి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ డి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రైతులు సాగు పద్ధతుల్లో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి నాట్లు ఆలస్యమైతే దగ్గర దగ్గరగా కుదుళ్లు వేసుకోవాలని తెలిపారు. దీర్ఘకాలిక రకాలైన శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జీఎల్–2537) వంటి రకాలకు 60 రోజుల వయసున్న నారును కూడా నాటుకోవచ్చని పేర్కొన్నారు.రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు వేసే అవకాశం లేకపోతే ప్రత్యామ్నాయంగా రాగి లేదా కంది పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఏరువాక పాడేరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేష్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే. బయ్యప్పరెడ్డి, డాక్టర్ పి. బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ బి. వెంకటేష్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వర్షం కోసం 101 బిందెల వారదులు

**గూడెంకొత్తవీధి,పెన్‌పవర్,ఆగస్టు 4:** వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గూడెంకొత్తవీధి మండలం లకవరపు పేట పంచాయతీ కే.కోడిసింగి గ్రామంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి, గ్రామదేవతలకు 101 పసుపు నీళ్ల బిందెలతో వారదులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు, గ్రామ మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా ఏకమై సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమం చేపట్టారు. 101 బిందెలను పసుపు నీటితో నింపి స్వామివారికి సమర్పించారు. స్వామివారు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండితేనే పేద రైతుల కుటుంబాలకు జీవనాధారం లభిస్తుందని తెలిపారు. గ్రామదేవతల ఆశీస్సులతో త్వరలో మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు.



